

# అవతలొడ్డు పొంగింది

చవితి వెన్నెల!

రాత్రి ఏడున్నర, ఎనిమిది గంటలవేళ ఆడవాళ్ళు వీధరుగుల మీద కబుర్లు చెప్పుకుంటుంటే, కొందరు ఇళ్ళలో రాత్రి వేపడాల్లో మునిగివుంటే, పూజారి వీధి పిల్లలంతా కృష్ణ వొడ్డున చట్టుమీద కబుర్లాడుకుంటూ, వాదులాడుకుంటూ తిరుగుతున్నారు.

ఆ సమయాన అవతలొడ్డు ఇసకపఱ్ఱ మీంచి దూరంగా పెద్దకేక "ఎవరా మడిసీ? పడవ దాటిపోయింది రచ్చించండో!" అంటూ. మొదట్లో పిల్లలు పట్టించుకోలేదు గాని, ఆ తర్వాత జాగ్రత్తగా వింటే ఆ కేకలు మరీ ఎక్కువయినాయి.

పిల్లలు సరదాకొద్దీ వినీ వినీ "ఓహోయ్ నీకేం భయంలేదు, మేఁవున్నా మొహోయ్" అని అరిచారు చట్టుమీంచి.

దాంతో అవతలొడ్డు మనిషి "బాబోయ్! చచ్చి మీ కడుపున పుడతాను బాబోయ్! పిల్లలు గలోణ్ణి బాబోయ్! సచ్చిపోతాను బాబోయ్" అని ఏడుపులూ.

"ఏడవబాకురా ఎదవా! నీకేం భయం లేదురా కుంకా!" పిల్లలు సరదా కొద్దీ తిట్లు.

"చచ్చి మీ కడుపున పుడతాను బాబో! మీరే దిక్కు తండ్రో" ఇసక పఱ్ఱమీంచి శోకాలు.

అందులో ఓ కుర్రాడు కోసురాయి మీద కెక్కి పెద్దగా "నీకేం కావాల్రా?" అని అన్నాడు.

"పడవ తీసుకురాండి బాబోయ్! చచ్చిపోతాను బాబోయ్" అని అవతలొడ్డునుంచి ఏడుపు.

పిల్లలంతా కూడబలుక్కున్నారు. పడవ సరంగు, రేవులో పడవొదిలేసి వెళ్ళిపోయాడు. లంగరెత్తేసి మనమే పడవ తీసికెళ్ళి వాణ్ణి రక్షిద్దాం అని నిశ్చయించారు.

వాడి ఏడుపులు చూసి నవ్వుకున్న పిల్లలు పడవ తీసికెళ్ళటానికి నిశ్చయించుకున్నారు గాని పడవ నడపడం ఎవరికీ రాదే? అందరూ పది పన్నెండేళ్ళవాళ్ళే! మరి పెద్దవాళ్ళ కెవరికన్నా చెప్దామా? అనుకున్నారు. చెప్తే మజా లేదు. మనవే పడవ తీసికెళ్ళి ఆ చవటని రక్షిద్దాం అనుకొని అందరూ ఇళ్ళదగ్గర కొచ్చి గడవెయ్యటం చాతయిన పాలేరు రంగడికి రహస్యంగా ఈ విషయం చెప్పి మెల్లిగా కృష్ణవొడ్డుకు చేరుకున్నారు. ఈ వార్త పెద్దలకు తెలియకుండా జాగ్రత్త పడ్డారు గాని పిల్లలకి తెలియక పోతుందా! వీధి వీధి పిల్లలంతా, కాస్త కునుకులో ఉన్న వాళ్ళతో సహా అంతా కృష్ణవొడ్డుకు చేరారు.

"రచ్చించండి దేవుడో ....." అవతలొడ్డు నుంచి కేక.

"భయంలేదు వస్తున్నావో" అని యాభైమంది పిల్లల కేక ఇవతలొడ్డు నుంచి.

లంగరెత్తేసి పిల్లలంతా పడవలో చేరారు. గడ వేసేది ఒక్క పాలేరు రంగడే. పిల్లలు ఓ పక్క కూర్చోరే! అటూ ఇటూ తిరగడాలు. కేరింతలు- పడవొరిగిపోతుంది - వాళ్ళలో వాళ్ళు కీచులాటలు. రంగడు అదమాయించి వాళ్ళనోరు మూయించి కదలకుండా కూర్చోపెట్టాడు. పడవ కృష్ణ మధ్య కొచ్చింది. అక్కడ గొప్ప వడి... పిల్లల్లో పెద్దవాడు కిట్టి "నేను గడేస్తాను" అన్నాడు. వొద్దు దేవుడా అన్నా వినకపోతే "నువ్వు తెడ్లు వెయ్యి దొరా" అని బతిమాలి కూర్చోపెట్టాడు రంగడు. పడవ మెల్లిగా అవతలొడ్డుకు చేరుకుంటోంది.

పిల్లలంతా పెద్దగా పాటలు పద్యాలు లంకించుకున్నారు. చప్పట్లతో తాళాలతో కృష్ణంతా మోగిపోతోంది. ఆ సమయాన కిట్టిగాడు తెడ్డు వాదిలేసి రంగడి దగ్గరకొచ్చి "ఒరే ఒరే నేనొక్కసారి గడేస్తానురా ...." అని బతిమిలాడాడు

అవతలొడ్డు కొచ్చాం గదా అని గడ చేతికిచ్చాడు రంగడు.

కిట్టి గడలో నాలుగోవంతు లేడు. ఎక్కడాలేని ఉత్సాహంతో గడ అందుకుని సయ్యిని నీళ్ళలో వేశాడు. పడవ ముందుకు సాగటంతో గడ చెయ్యి జారింది. కిట్టి నీళ్ళలో పడబోతుంటే రంగడు టక్కున పట్టుకున్నాడు. గడ క్రిష్ణలో కొట్టుకుపోయింది. పడవ వొడ్డు చేరింది. పిల్లలంతా "హో" అంటూ ఇసకలో కొచ్చారు.

"మీరు రాకపోతే ఈ రాత్రేళ ఈ ఇసకలో గుండె పగిలి సచ్చేవాణ్ణి బాబోయ్!" అని కళ్ళనీళ్ళతో పరుగుపరుగున పడవలో కొచ్చాడు ఇసకపర్ర మనిషి.

రంగడికి గొప్ప దిగులైంది. గడ కృష్ణలో కొట్టుకుపోయింది. పడవ నడవదని చెప్పాడు. పిల్లల గుండెలు గుభిల్లుమన్నాయి. బిక్కమొహాలు వేశారు. అప్పటిదాకా ఉన్న ఉత్సాహం దుఃఖంగా మారిపోయింది. ఒకడెవరో బావురుమన్నాడు. దాంతో యాభైమంది పిల్లలు బావురుమన్నారు.

"అమ్మా ! రచ్చించండే ...... "

"అయ్యా! నాకు బయమేస్తోందే"

"పిన్నీ నా కాకలేస్తోందే ...."

"అవ్వా ! నాకు దెయ్యాల బయమే."

"వో ...... " అని అవతలొడ్డునుంచి యాభైమంది పిల్లల ఏడుపులు. వాళ్ళతో కలిసి "చచ్చి మీ కడుపున పుడతానో ..." అని పరదేశి ఏడుపు.

వీధిలో పిల్లలెవరూ లేకపోవటం, కృష్ణ అవతలొడ్డు నుంచి గుండెలు చీల్చుకుపోయేట్లు పిల్లల ఏడుపులు విన్పించటంతో తల్లులు, తండ్రులు అవతలొడ్డు పొంగింది

బెంబేలయిపోయి కృష్ణ ఇవతలొడ్డుకు చేరారు. అవతల్నించి పిల్లలు ఆపకుండా ఏడుపులు, ఇవతలొడ్డు నుంచి తల్లులు "మా తండ్రే .... మాచిట్టే .... మా బుల్లే ..... మా కన్నే ..... నేను చచ్చిపోనో" అంతకంటె పెద్దగా ఏడుపులు!

ఎవరికీ ఏం చేయటానికి తోచిందిగాదు. పడవేమో అవతలుంది. పున్నయ్య, సదయ్య ఆడవాళ్ళకి ధైర్యం చెప్పి పుట్టగోచీలు బిగించి రెండు తెప్ప కొయ్యలు వేసుకుని "సయ్ సయ్"మని ఈదుకొంటూ అవతలొడ్డుకు చేరుకున్నారు. వాళ్ళని కావిలించుకొని పిల్లలు మళ్ళీ ఏడుపులు. ఆకలేస్తోందో అని గోల, పడవలో ఎక్కించుకుని వీళ్ళని తీసుకెళ్దామంటే గడలేదు. సదయ్య ధైర్యంకోసం అక్కడే వుండి పున్నయ్యని వెనక్కి పంపించాడు.

పున్నయ్య వెనక్కొచ్చి మరో పడవకోసం వాకబుచేస్తే ఎక్కడా పడవలేదు. ధరణికోట రేవు పడవకి తారెయ్యటానికి వొడ్డెక్కించారు. గడకోసం మనిషిని అదితికి పంపించారు. ఈ లోపున అవతలొడ్డునుంచి పిల్లలు ఆకలేస్తుందని అని అరుపులు.

ఇంతలో పల్లపీధినుంచి మరో నాలుగు తెప్పకొయ్యిలు తెప్పించి మరో నలుగురు మనుషులు అన్నం మూటలు, పెరుగు మూటలు కట్టుకుని రెండు లాంతర్లతో అవలొడ్డుకు చేరారు. పిల్లలు ఆ అన్నాలు తిని కృష్ణనీళ్ళు తాగటంతో కొంత శాంతించారు.

ఎట్టకేలకు అద్దీనుంచి గడ వొచ్చింది. ఆ గడని రయ్యిని తెప్పకొయ్యమీద అవతలొడ్డుకి తీసికెళ్ళి పడవకి లంగరెత్తేసి, "మా తండ్రుల్లారా! మా తల్లుల్లారా! ఎక్కండర్రా పడవ" అని పెద్దగా పెద్దలు అరిస్తే పిల్లలు ఒక్కళ్ళూ వచ్చి పడవెక్కరే!

వాళ్ళు చవితి వెన్నెట్లో చద్ది భోంచేసి, ఇసక తిన్నెలో గీతలు గీసుకుని చర్పట్టి, కుందులు ఆడుకుంటూ, పడవ గురించీ, గడ గురించీ, అమ్మా అయ్యా గురించీ ఎప్పుడో మర్చిపోయారు. పిల్లల ఆటపాటల్తో మోగి పోతున్న అవతలొడ్డుకి అంత రాత్రివేళ ఎవరో కితకితలు పెట్టినట్టుంది.*